

పరదేశీ కథలు

- చిట్టి సిద్ధ లలిత



- 141 -

కలల పునాది

యర్రపల్లి ఊరి వీధుల్లో ఎర్రటి మట్టిలో ఆడుకోవాల్సిన వయసులో శివుడి చేతికి పార, గంప వచ్చాయి. తండ్రి అనారోగ్యానికి గురికావడంతో, ఇల్లు గడవడం కష్టం అయింది. వున్న ఎకరం పొలం ఎలా సాగు చెయ్యాలో శివుడికి తెలియలేదు.

అమ్మ కూలిపనికి వెళ్ళి తెచ్చే డబ్బు ఏ మూలకు వస్తుంది? పధ్నాలుగు యేళ్ళ వయసులో శివుడు బడి వదిలేసి భవన నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టాడు. పుస్తకాలు పట్టుకుని బడికి పోవాల్సిన శివుడు ఇటుకలు, ఇసుక మోసాడు.

తరువాత ఊళ్లో చిన్నచిన్న గోడలు కట్టే పనితో ప్రారంభించిన అతడి ప్రయాణంలో, కష్టంతో పాటు పనిపట్ల అంకితభావం, శ్రద్ధ స్పష్టంగా కనిపించేది.

అదే ఊరిలో ఉండే రామయ్య అనే అనుభవజ్ఞుడైన తాపీ మేస్త్రీ శివుడిలోని ఆసక్తిని గమనించి, నిర్మాణ రంగంలోని మెళకువలు కొన్ని నేర్పించాడు. శివుడికి చిన్నప్పటి నుండి చిత్రలేఖనం వచ్చు.

ఆ నైపుణ్యాన్ని ఇళ్ల నమూనాలు (డిజైన్లు) వేయడానికి ఉపయోగించేవాడు. కేవలం తాపీ మేస్త్రీగానే కాకుండా, ఇళ్ల డిజైన్లలో కొత్తదనం చూపిస్తూ పంతొమ్మిది ఏళ్ల వయసుకొచ్చేసరికి ఊరిలో మంచి గుర్తింపును తెచ్చుకున్నాడు.

అదే సమయంలో అతడి మేనమామ కూతురు సిరి అతడి మనసుకు దగ్గరయ్యింది.

ఊళ్లోనే అతిపెద్ద ధనవంతుడు, పెద్ద కాంట్రాక్టర్ అయిన మేనమామ కూతురైన సిరి, హోదాలో అంతరం ఉన్నా శివుడిని ఎంతో ఆప్యాయంగా చూసేది.

తమ ఇంట్లోని వరండాలో సిరి సాయంత్రం వేళల్లో పిల్లలకు చదువు చెప్పేది. శివుడి కష్టం, అతడి కళ్లలో కనిపించే నిజాయితీ మరదలు సిరి మనసును గెలుచుకున్నాయి. "నువ్వు ఈ చిన్న ఊరికే పరిమితం కాకూడదు శివుడు, నీ చేతికి ప్రపంచాన్ని నిర్మించే శక్తి ఉంది" అని సిరి తరచూ ధైర్యాన్ని ఇచ్చేది.

20 ఏళ్ల వయసులో శివుడు ఊళ్లోనే ఒక కమ్యూనిటీ హాలు నిర్మాణం చేపట్టాడు. తక్కువ బడ్జెట్‌లో, ఎంతో బలంగా, చూడటానికి ప్యాలెస్ లాంటి రూపంతో అతడు ఆ భవనాన్ని పూర్తి చేశాడు. ఆ ఊరి ప్రజలందరూ శివుడి నైపుణ్యాన్ని చూసి "శభాష్ శివుడు" అని మెచ్చుకున్నారు. కానీ, ఆగర్భశ్రీమంతుడైన మేనమామ తన కూతురు సిరి, పేదవాడైన శివుడి మధ్య పెరుగుతున్న అనుబంధాన్ని సహించలేకపోయాడు.

కువైట్ నుంచి వచ్చిన ఒక ఏజెంట్ సహాయంతో శివుడికి గల్ఫ్ దేశాల్లో గొప్ప భవిష్యత్తు ఉందనే ఆశ చూపి, అతడిని ఊరి నుంచి పంపించే ఏర్పాట్లు చేశాడు అతడి మేనమామ.

"బావా నువ్వు విజేతగా తిరిగి రావాలి, అప్పటివరకు నేను నీకోసం వేచి ఉంటాను" అని సిరి కన్నీళ్లతో శివుడికి వీడ్కోలు చెప్పింది. అయితే, శివుడు కువైట్ విమానం ఎక్కగానే, మేనమామ తన అహంకారంతో సిరిపై ఒత్తిడి తెచ్చి, ఒక పెద్ద సంపన్నుడి సంబంధం చూసి బలవంతంగా పెళ్లి చేశాడు.

కువైట్ గడ్డపై అడుగుపెట్టిన శివుడికి ఊహించని కష్టం ఎదురైంది. ఏజెంట్ చెప్పిన కంపెనీ, జీతం అన్నీ అబద్ధాలని తేలింది. అక్కడ ఒక తెలుగు కాంట్రాక్టర్ శివుడి పాస్‌పోర్ట్ గుంజేసుకుని, సరిగా తిండి కూడా ఇవ్వకుండా ఎడారి ఎండలో రాతి పనులు చేయించుకుంటూ చిత్రహింసలు పెట్టాడు. మరోవైపు యర్రపల్లిలో సిరి జీవితం నరకప్రాయంగా మారింది. గొప్పలు చూసి తండ్రి చేసిన పెళ్లి సిరి కొంప ముంచింది. భర్త తీవ్రమైన పేకాట వ్యసనానికి, అమ్మాయిల వ్యామోహానికి బానిస అని పెళ్లయ్యాకే తెలిసింది. ఆస్తిపాస్తులన్నీ తగలేస్తూ, రోజూ సిరిని శారీరకంగా, మానసికంగా వేధించేవాడు. సిరి వంటిపై బంగారం అంతా అమ్మేసి తాగేసాడు.

తాగుడుకు బానిసైన భర్త అనబడే ఆ తాగుబోతు కొద్దిరోజులకే లివర్ చెడిపోయి దారుణమైన స్థితిలో ప్రాణాలు విడిచాడు. అప్పటికే సిరి బతుకు పూర్తిగా నాశనమైంది.

పెళ్ళయి రెండేళ్ళు గడవకముందే వైధవ్యంతో పుట్టింటికి వచ్చేసింది.

సిరిని ఆ స్థితిలో చూసి సిరి వాళ్ళమ్మ లక్ష్మి గోలుగోలున ఏడుస్తూ నెత్తి నోరూ బాదుకుంది. భర్త మూర్ఖత్వానికి, చేసిన తొందరపాటు చర్యకు బిడ్డ బతుకు బలయ్యిందని భర్తను తిట్టింది.దాంతో అతడికి పశ్చాత్తాపం కలిగింది

భర్త మూర్ఖత్వానికి, చేసిన తొందరపాటు చర్యకు బిడ్డ బతుకు బలయ్యిందని భర్తను తిట్టింది.

దాంతో అతడికి పశ్చాత్తాపం కలిగింది

తన అహంకారంతో కూతురి జీవితాన్ని చేతులారా పాడుచేసానని గ్రహించిన తండ్రి, సిరి దీనస్థితిని చూసి కుమిలి కుమిలి ఏడ్చాడు.

"నా స్వార్థమే నా కూతురి బతుకును బూడిద చేసింది" అని ఊరంతటి ముందూ కన్నీరు మున్నీరయ్యాడు.

ఇక్కడ కువైట్‌లో శివుడు ధైర్యాన్ని కూడగట్టుకుని, ఆ దగాకోరు కాంట్రాక్టర్ బంధనం నుండి తప్పించుకుని ఎడారి దారి పట్టాడు. భాష తెలియని పరాయి దేశంలో ఆకలితో స్పృహతప్పి పడిపోయిన శివుడిని ఒక అరబ్ షేక్ ఆసిఫ్ పరివారం చూసి కాపాడింది. శివుడి వద్ద ఉన్న సంచిలోని అద్భుతమైన ఆర్కిటెక్చర్ డిజైన్లను చూసిన ఆ షేక్ ఆశ్చర్యపోయాడు.

షేక్ ఆసిఫ్ శివుడి నైపుణ్యాన్ని గమనించి, తన కలల రాజభవనం (ప్యాలెస్) నిర్మాణ బాధ్యతలను అతడికే అప్పగించాడు. శివుడు ఆ అవకాశాన్ని దైవంగా భావించి, పగలు రాత్రి తేడా లేకుండా, ఎడారి వాతావరణానికి తట్టుకునేలా, భారతీయ శిల్పకళా శోభతో ఆ ప్యాలెస్ నిర్మాణాన్ని అత్యంత అద్భుతంగా ప్రారంభించాడు.

భవన నిర్మాణం చివరి దశకు చేరుకుంటున్న సమయంలో, శివుడిని పూర్వం మోసం చేసిన తెలుగు కాంట్రాక్టర్ ఈ విషయాన్ని తట్టుకోలేకపోయాడు. శివుడు విజయం సాధిస్తే తన అక్రమాలు బయటపడతాయని భయపడి, రాత్రివేళ భవన నిర్మాణ భాగాలను ధ్వంసం చేయడానికి కుట్ర పన్నాడు. కానీ శివుడు తన పనిపట్ల ఉన్న జాగ్రత్తతో ఆ కుట్రను ముందే పసిగట్టి, వారిని పట్టుకుని షేక్ ముందు నిలబెట్టాడు.

షేక్ ఆ కాంట్రాక్టర్ అక్రమాలను ఛేదించి అతడిని చట్టానికి అప్పగించాడు. కొద్దిరోజుల్లోనే ఆ ప్యాలెస్ నిర్మాణం పూర్తయింది. ఎడారి గుండెల్లో ఒక అద్భుతమైన కళాఖండంలా ఆ రాజభవనం మెరిసిపోయింది. ఆ దారిన వెళ్లే ప్రతి ఒక్కరి దృష్టిని ఆ కట్టడం ఆకర్షించింది. అరబ్ మీడియా అంతటా యంగ్ ఆర్కిటెక్ట్ శివుడి పేరు మారుమోగిపోయింది.

ప్యాలెస్ ప్రారంభోత్సవం రోజున షేక్ ఆసిఫ్ శివుడిని ఘనంగా సత్కరించి, తన అంతర్జాతీయ సంస్థలో నిర్మాణరంగంలో మేనేజర్ గా ప్రకటించాడు.

యర్రపల్లిలో ఒక అనామక యువకుడైన శివుడి దశ తిరిగిపోయింది.

విజేతగా, కోటీశ్వరుడిగా శివుడు తిరిగి యర్రపల్లిలో అడుగుపెట్టాడు. ఊరంతా అతడికి బ్రహ్మరథం పట్టింది. కానీ ఊరిలోకి రాగానే సిరి అనుభవించిన నరకం, ఆమె వైధవ్యం, మేనమామ పశ్చాత్తాపం శివుడికి తెలిసాయి.

ఒకప్పుడు అహంకారంతో విర్రవీగిన మేనమామ, ఇప్పుడు శివుడి చేతులు పట్టుకుని "నన్ను క్షమించు శివుడూ... నీ అర్హతను గుర్తించక నా కూతురి బతుకును నాశనం చేశాను" అని ఏడ్చాడు.

శివుడు కన్నీళ్లతో కరిగిపోతున్న సిరిని చూశాడు. సమాజం ఏమనుకున్నా సరే, చిన్ననాటి నుంచి తనని నమ్మిన సిరి జీవితానికి మళ్లీ వెలుగునివ్వాలని నిర్ణయించుకున్నాడు. సిరి చేతిని తన చేతిలోకి తీసుకుని, ఆమె కన్నీళ్లు తుడిచి ధైర్యాన్ని ఇచ్చాడు.

మేనమామ ఆనందబాష్పాలతో వారిద్దరినీ దీవించాడు. యర్రపల్లి మట్టిలో మొదలై, గల్ఫ్ ఎడారిని, కువైట్ సేటు హృదయాన్ని గెలిచిన ఒక మేస్త్రీ ప్రయాణం విధేయత, పట్టుదల, స్వచ్ఛమైన ప్రేమతో యర్రపల్లి చరిత్రలో చిరస్థాయిగా నిలిచింది.

(మరోకథ వచ్చేనెల)

Post your comments